
సాక్షి
నాగర్‌కర్నూల్
మంగళవారం । 14 । మార్చి । 2023



ఉత్తిపోతలే..!
వనపర్తి జిల్లాలోని 14 ఎత్తిపోతల పథకాలు పర్యవేక్షణ లోపం కారణంగా మూతబడ్డాయి.
వివరాలు 8లో ▸



ఎండుతున్న పంటలు
పాన్‌గల్ మండలంలో కాల్వల ద్వారా సాగు నీరు నిలిచిపోయి పంటలు ఎండుతున్నాయి.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.1 /19.2
వాతావరణం
మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉండి ఉక్క పోస్తుంది. సాయంత్రం నుంచి మేఘావృత్తమై ఉంటుంది. రాత్రికి చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ మనోహర్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు ప్రజావాణిలో ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం మూడు ఫిర్యాదులు రాగా.. అందులో రెండు ఇరువర్గాల మధ్య తగవు, మరొకటి భూసం బంధిత గొడవకు సంబంధించిందని ఎస్పీ తెలిపారు.

కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి



బిజినేపల్లి: రాష్ట్రంలోని 4కోట్ల మంది ప్రజల ప్రయోజనార్థం కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని, కానీ లబ్ధి మాత్రం ఒక్క సీఎం కేసీఆర్ కుటుంబానికి మాత్రం జరిగిందని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం తిమ్మాజీపేట మండలంలోని గోరిటలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాలన మొత్తం కల్వకుంట్ల కుటుంబంలోని కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్‌రావులే చేస్తున్నారని, మిగిలిన మంత్రులు, ఎమ్మెల్యేలకు స్వతంత్రం లేకుండా పోయిందన్నారు. ఆ కుటుంబసభ్యులను ఎదిరించి ఒక్క రూపాయి కూడా వారి నియోజకవర్గాలకు తేలేరని ఎద్దేవా చేశారు. అలాంటి కుటుంబ పాలనకు స్వస్తి పలకాలని.. డిసెంబర్‌లో జరిగే ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అర్థం రవి, వెంకట్రామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం రుణ లక్ష్యాన్ని చేరుకోవాలి



బల్మూర్: మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వంద శాతం రుణాలు అందించాలని ఏపీడీ లక్ష్మీనారాయణ ఐకేపీ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో జరిగిన ఈసీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మండలానికి రూ.30 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించగా.. నేటికి రూ.26.40కోట్లు అందజేశారని, మిగతా రూ.3.60కోట్లు సైతం ఈ నెల 24వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు. రుణాలు తీసుకున్న మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదిగేలా ఈసీ మెంబర్లు, అధికారులు సూచనలు ఇవ్వాలని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న మొండి బాకాయిలను రికవరీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీఎం అరుణాదేవి, ఏపీఎం చిట్టెమ్మ, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

ల్యాబ్ మేనేజర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి టీ–డయాగ్నోస్టిక్ కేంద్రంలో రేడియాలజిస్ట్, రేడియోగ్రాఫర్, ల్యాబ్ మేనేజర్‌గా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రవినాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేడియాలజిస్ట్–1, రేడియోగ్రాఫర్–2, ల్యాబ్ మేనేజర్–1 పోస్టు ఖాళీగా ఉన్నాయని, రేడియాలజిస్టు పోస్టులో పనిచేసేందుకు ఎండీ (రేడియాలజీ) ఉత్తీర్ణులై, ఎన్ఎంసీ/ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయిన వారు అర్హులన్నారు. ఈ పోస్టుకు ఎంపికైన వారికి నెలకు రూ.లక్ష వేతనం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రేడియోగ్రాఫర్ పోస్టుకు డిప్లొమా లేదా బీఎస్సీ (రేడియోగ్రఫీ), డిప్లొమా ఇమేజింగ్ టెక్నాలజీలో ఉత్తీర్ణులై ఉండాలని, మమోగ్రామ్ శిక్షణ పొందిన మహిళా అభ్యర్థికి ప్రాధాన్యత ఉంటుందని, ఈ పోస్టుకు ఎంపికైన వారికి నెలకు రూ.30 వేల వేతనం ఇస్తారన్నారు. ల్యాబ్ మేనేజర్ పోస్టుకు ఎమ్మెస్సీ (మైక్రో బయాలజీ /బయోకెమిస్ట్రీ) అర్హత కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 25 వరకు జనరల్ ఆస్పత్రి లో సమర్పించాలని కోరారు.

ఓటేసిన టీచర్లు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 93.30శాతం ఓటింగ్ నమోదు
- గద్వాలలో అత్యధికం.. మహబూబ్‌నగర్‌లో అత్యల్పం

ప్రశాంతంగా ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

సాక్షి, నాగర్‌కర్నూల్: మహబూబ్‌నగర్–హైదరాబాద్– రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా మొత్తం 93.30శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో 97.15 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 88.01శాతం మాత్రమే ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 93.96 శాతం, వనపర్తి జిల్లాలో 93.48 శాతం, నారాయణపేట జిల్లాలో 93.92 శాతం ఓటింగ్ నమోదైంది. సోమవారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్సీ పోలింగ్ ప్రారంభం కాగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్ల రాక మొదలైంది. సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ కొనసాగింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ముగిసింది.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మనోహర్



జిల్లా కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ మనూచౌదరి


■ నాగర్‌కర్నూల్ జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నిక నిర్వహణ చేపట్టగా మొత్తం 93.96 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 1,822 మంది ఓటర్లకు 1,712 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 607 మంది మహిళా ఓటర్లు కాగా, 1,105 మంది పురుష ఓటర్లు ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా తెలకపల్లి మండలంలో 97.30 శాతం ఓటింగ్ జరగ్గా, కోడేరు పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 77.78 శాతం పోలింగ్ నమోదైంది.

■ వనపర్తి జిల్లాలో మొత్తం 7 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నిక నిర్వహించగా 93.48శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 1,335 మంది ఓటర్లకు గానూ 1,248 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 453 మంది మహిళా ఓటర్లు కాగా, 795 మంది పురుష ఓటర్లు ఉన్నారు. ఖిల్లాఘనపురం స్టేషన్‌లో వందశాతం పోలింగ్ కాగా.. కొత్తకోటలో 99 శాతం నమోదు కాగా.. అత్యల్పంగా వీపనగండ్లలో 90శాతం నమోదైంది.

2 కేంద్రాల్లో వందశాతం

■ **మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 3,461 మంది ఓటర్లకు 3,046 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 1,394 మంది** మహిళా ఓటర్లు ఉండగా, 1,881 మంది పురుష ఓటర్లు ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 15 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నిక నిర్వహించగా, అత్యధికంగా చిన్నచింతకుంట మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ పోలింగ్‌కేంద్రంతో పాటు నవాబుపేట జెడ్పీహెచ్ఎస్ కేంద్రంలో 100 శాతం పోలింగ్ నమోదైంది. జడ్చర్ల పోలింగ్‌కేంద్రంలో 94.61 శాతం, మహబూబ్‌నగర్‌లోని మోడ్రన్ హైస్కూల్ కేంద్రంలో 94.44 శాతం ఓటింగ్ జరగ్గా అత్యల్పంగా బాలానగర్ కేంద్రంలో 83.87శాతానికే పోలింగ్ పరిమితమయింది.

జిల్లాలో పోలింగ్ ఇలా...



జిల్లా	మహిళఓటర్లు	పోలైనవి	పురుష ఓటర్లు	పోలైనవి
మహబూబ్‌నగర్	1,580	1,394	1,881	1,652
నాగర్‌కర్నూల్	653	607	1169	1,105
వనపర్తి	474	453	861	795
గద్వాల	316	307	561	545
నారాయణపేట	236	226	422	392



■ జోగుళాంబ గద్వాల జిల్లాలో 11 కేంద్రాల్లో ఎన్నిక నిర్వహించగా అత్యధికంగా మొత్తం 97.15 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం 877 మంది ఓటర్లకు 852 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 307 మంది మహిళలు కాగా, 545 మంది పురుష ఓటర్లు ఉన్నారు. జిల్లాలోని గట్టు, ఇటిక్యాల, మానవపాడు, ఉండవెల్లి మండలాల పోలింగ్ కేంద్రాల్లో వందశాతం ఓటింగ్ నమోదు కావడం గమనార్హం. అత్యల్పంగా మల్దకల్ మండల పోలింగ్‌కేంద్రంలో 95.45 శాతం పోలింగ్ పూర్తయింది.

■ నారాయణపేట జిల్లాలో 5 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నిక నిర్వహించగా, మొత్తం 93.92 శాతం ఓటింగ్ జరిగింది. జిల్లాలో మొత్తం 658 మంది ఓటర్లకు 618 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో 226 మంది మహిళా ఓటర్లు కాగా, 392 మంది పురుష ఓటర్లు ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా కోస్గి పోలింగ్ కేంద్రంలో 97.67 శాతం నమోదైంది. అత్యల్పంగా మరికల్ పోలింగ్ కేంద్రంలో 88.68 శాతం ఓటింగ్ నమోదైంది.



అమ్రాబాద్‌లో సిరా గుర్తు చూపుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటేశ్వర్లు

ఇంటర్ పరీక్షలకు వేళాయె..



పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్ వెంకటరమణ

రేపటి నుంచి ప్రారంభం

- హాజరుకానున్న మొత్తం 13,303 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- కరోనా తర్వాత వందశాతం సిలబస్‌తో పరీక్షలు

అచ్చంపేట/కందనూలు: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 15వ తేదీన మొదటి సంవత్సరం, 16వ తేదీన రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలిపి 71 జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 35 ప్రభుత్వ సెక్టార్ కళాశాలలు, 21 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 13,303 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 7,112 మంది, ద్వితీయ సంవత్సరంలో 6,191 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 31 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 31 మంది డిపార్ట్‌మెంటు ఆఫీసర్లు, 12 మంది ఆడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, 5మంది కస్టోడియన్స్, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంచినీటి సౌకర్యం, విద్యుత్ సరఫరాల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్ జి.వెంకటరమణ ఆధ్వర్యంలో సిబ్బందికి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.

వంద శాతం సిలబస్..

పరీక్షలు ఈ నెల15వ తేదీ నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా.. విద్యార్థులు సైతం ఇళ్లల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. 2019–20 విద్యా సంవత్సరం తర్వాత ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు వందశాతం సిలబస్‌తో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. కరోనా నేపథ్యంలో 2020 మార్చిలో జరగాల్సిన పరీక్షలను రద్దు చేసి విద్యార్థులందరినీ ప్రమోట్ చేయగా.. 2021లోనూ పరీక్షలు నిర్వహించలేదు. అనంతరం 2021 సెప్టెంబరులో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే పరీక్షలు నిర్వహించారు. అయితే ఇందులో అత్యధిక శాతం మంది విద్యార్థులు ఫెయిల్ కాగా, ఆ తర్వాత విద్యార్థులు,తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత రావడంతో వారందరినీ పాస్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 2022లో పరీక్షలు సైతం పూర్తిస్థాయి సిలబస్‌తో నిర్వహించలేదు.

ఇరువురికీ 'పరీక్ష'

అటు విద్యార్థులు.. ఇటు వారికి చదువు చెప్పిన అధ్యాపకులు టెన్షన్‌కు గురవుతున్నారు. కరోనా తర్వాత తొలిసారిగా వంద శాతం సిలబస్‌తో పరీక్షలు నిర్వహిస్తుండడంతో కొంతమంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు జ్వరం పట్టుకుంది. ఇప్పటికే ఆస్పత్రులకు వసున్న వారిలో ఫ్లూ లక్షణాలు బయటపడుతుండడం కలకలం రేపుతోంది. ఇదిలాఉండగా, అధ్యాపకులకు సైతం పరీక్షా కాలంగా తయారైంది. ఎలాగైనా తమ పిల్లలు అందరికంటే మెరుగైన ఫలితాలు సాధించాలని ఇటు విద్యా సంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు మాత్రమే కాదు చివరకు వారి తల్లిదండ్రులు కూడా ఆశిస్తుంటారు. చదువు విషయంలో ఇంట్లో తల్లిదండ్రుల నుంచి కాలేజీలో అధ్యాపకుల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించే నిపుణులు కాలేజీల్లో లేకపోవడం ఈ విద్యార్థుల పాలిట శాపంగా తయారైంది.

30 నిమిషాల ముందే చేరుకోవాలి

ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థుల సంఖ్యను బట్టి ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పరిశీలించి 31 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. రెండు సిట్టింగ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నిరంతరం తనిఖీలు చేస్తాయి. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించాం. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను కేంద్రంలోకి అనుమంతించరు. అందుకే 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

– వెంకటరమణ,
జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

అన్ని ఏర్పాట్లు పూర్తి

నాగర్‌కర్నూల్: బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ తెలిపారు. సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. వీసీలో కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 13,303 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, వేసవి కాలం నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు..

ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తున్నందున విద్యార్థులు ఉదయం 8:30వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపే విధంగా ఆర్టీసీ డీఎం ఆదేశించామని వివరించారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం, మధ్యాహ్నం పరీక్ష పూర్తి అయిన వెంటనే తిరిగి గ్రామాలకు చేరవేసే విధంగా రూట్ల వారీగా అన్ని పరీక్షా కేంద్రాలకు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఏమైనా సమస్యలు ఏర్పడితే వెంటనే పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, 08540–230210 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీసీలో ఎస్పీ కె.మనోహర్, అధికారి వెంకటరమణ, రాజశేఖర్, ఆర్టీసీ డీఎం, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

ప్రస్తుతం ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరుకావాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఒకవేళ మానసిక ఒత్తిడి, ఓటమి భయం, జ్ఞాపక శక్తి, భయాందోళన వంటి సమస్యలు ఉంటే మానసిక వైద్య నిపుణుల ద్వారా సలహాలు సూచనలు ఇచ్చేవిధంగా టోల్ ఫ్రీ నం .14416 ఏర్పాటు చేశామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



గాంధీ పార్కు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

నాగర్‌కర్నూల్ రూరల్: గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, జీఓ నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. అలాగే, కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వం స్పందించకుంటే నిరవదిక సమ్మెకు సిద్ధమవుతామని అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు బాలస్వామి, చిట్టెమ్మ, సుబ్బయ్య, మహిపాల్, మల్లేశ్, అంజి, వేమయ్య, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య ఉండొద్దు

అచ్చంపేట రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో రానున్న వేసవికాలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బలరాంనాయక్‌తో కలిసి వాటర్‌మెన్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏ కాలనీల్లో అధిక తాగునీటి సమస్య ఉందని ముందే గ్రహించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. నల్లాల వద్ద వృథాగా నీరు వెళ్లకుండా బిరడాలు బిగించాలన్నారు. అలాగే లీకేజీ సమస్యలు లేకుండా చూడాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వాటర్‌మెన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ నర్సింహగౌడ్

మన్యంకొండ హుండీ ఆదాయం రూ.9.10 లక్షలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.9,10,443 వచ్చింది. సోమవారం ఉదయం చేపట్టిన హుండీ లెక్కింపు సాయంత్రం ముగిసింది. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ఇన్‌స్పెక్టర్ వీణాధరి, పర్యవేక్షకులు నిత్యానందచారి, శ్రీనివాస్‌గౌడ్, ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ గోవిందరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలో పడి విద్యార్థిని మృతి


నాగజ్యోతి (ఫైల్)

కోయిల్‌కొండ: మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో ఓ విద్యార్థిని బావిలో పడి మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బూర్గుపల్లి గ్రామానికి చెందిన నాగమ్మ, పోషయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు పెద్ద కూతురు నాగజ్యోతిని(17) వంట ఎందుకు చేయలేదని మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన నాగజ్యోతి రాత్రి 11గంటల సమయంలో ఇంట్లో అందరూ పడుకున్న తర్వాత గ్రామశివారులోని వెంకట్‌రెడ్డి పొలానికి వెళ్లింది. ఆ బావిలో పడి మృతిచెందింది. సోమవారం తెల్లవారుజామున చుట్టుపక్కల వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నాగజ్యోతి ఇంటర్ సెకండ్‌ఇయర్ చదువుతోంది.

చెరువులో పడి యువకుడు..

చిన్నచింతకుంట: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని అప్పంపల్లి గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌లోని గోల్కొండలో దాన్‌కోటకాలనీకి చెందిన మహ్మద్ రజి ఉద్దీన్(26) అప్పంపల్లిలో అబ్దుల్ రహమాన్ ఉర్సు ఉత్సవాలకు ఈనెల 11న వచ్చారు. 12వ తేదీన సాయంత్రం దర్గా సమీపంలో ఉన్న నైజగాని చెరువుకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులోపడి చనిపోయాడు. సోమవారం గుర్తించిన గ్రామస్తులు, పోలీసులకు తెలిపారు. ఈ మేరకు ఏఎస్సై సదాతుల్లా సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుని అన్న సయ్యద్ మన్నన్‌కు సమాచారం అందించారు. మన్నన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

అచ్చంపేట రూరల్: మండలంలోని పులిజాలలో ఐదేళ్ల బాలుడిపై కుక్కలు దాడిచేసి గాయపర్చిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలాలా.. బల్మూర్ మండలం గోదల్ గ్రామానికి చెందిన బాలరాజు కుమారుడు అనిరుధ్ తన తల్లి వెంట అమ్మమ్మ ఊరైన పులిజాలకు వచ్చాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటుండగా ఒక్కసారిగా పక్కనే ఉన్న కుక్కలు బాలుడిపై దాడి చేసి చేయి, కడుపు, ముఖంపై కరిచాయి. దీంతో బాలుడి కేకలు విన్న చుట్టుపక్కల వారు కుక్కలను తరిమేశారు. కుటుంబ సభ్యులు బాలుడిని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స చేయించారు. బాలుడికి ప్రమాదమేమీ లేదని వైద్యులు తెలిపారు. బాలుడి కేకలు విని సకాలంలో చుట్టుపక్కల వారు వచ్చి కుక్కలను తరమడంతో బాలుడికి ఎలాంటి అపాయం కాలేదని, గాయాలతో బయటపడ్డాడని స్థానికులు చెప్పారు.

18 లీటర్ల సారా, బైక్ స్వాధీనం

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్ గ్రామంలో సోమవారం ఉదయం 18 లీటర్ల నాటుసారా, బైక్‌ను ఎక్సైజ్ సిబ్బంది జటప్రోల్ సమీపంలో స్వాధీనం చేసుకున్నారు. బైక్‌ను సీజ్ చేశారు. విక్రేతను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి, వదిలిపెట్టినట్లు సీఐ ఏడుకొండలు తెలిపారు.

కేసు నమోదు

మహమ్మదాబాద్: భార్యతోపాటు అత్తామామలపై హత్యాయత్నం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా.. మండలంలోని మొకర్లాబాద్‌కు చెందిన కుర్వ మంగమ్మను 16 ఏళ్ల క్రితం హన్వాడ మండలం మునిమోక్షం గ్రామానికి చెందిన కుర్వ మహేశ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. అయితే భార్యపై అనుమానం పెంచుకున్న మహేశ్ కొన్నిరోజులుగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో భర్తతో గొడవపడిన మంగమ్మ తల్లిదండ్రులతో కలిసి మొకర్లాబాద్‌కు బయలుదేరారు. దీంతో భర్త మహేశ్ మార్గమధ్యలో భార్యతోపాటు అత్తామామలపై ఇష్టానుసారంగా దాడిచేసి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం: కేసు నమోదు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని బంగారమ్మగడ్డ కాలనీలోని ఎరుకలి కృష్ణయ్య ఇంట్లో రేషన్ బియ్యం 20 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నామని గోపాల్‌పేట ఎస్సై తెలిపారు. తమకు సమాచారం అందడంతో సోమవారం సాయంత్రం సోదాలు చేయగా లభించాయని, కృష్ణయ్యపై కేసు నమోదు చేసి, రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉత్తిపోతలే..!


మూతబడిన మహబూబ్‌పాల్ సముద్రం లిఫ్ట్

వనపర్తి జిల్లాలో 18 సాగునీటి పథకాలు
- నిరుపయోగంగా మారినవి 14
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న రైతులు


కొన్నూరు వద్ద వృథాగా నెల్విడి లిఫ్ట్

మదనాపురం: ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఎత్తిపోతల పథకాలు ఆశించిన మేర ఫలితాలు ఇవ్వడం లేదు. రైతుల సమన్వయ లోపం, నిర్వహణ కమిటీలు, ఐడీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వనపర్తి జిల్లాలో 18 ఎత్తిపోతల పథకాలు ఉండగా.. 14 మూతబడ్డాయి. మిగిలిన 4 లిఫ్టులు కూడా పాక్షికంగా నడుస్తుండటంతో పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ఇందుకు ప్రధాన కారణం లిఫ్ట్‌లకు సంబంధించిన ప్యానల్ బోర్డులు, మోటార్లు, పంపులు మరమ్మతులకు గురికావడం, పైపులైన్లు ధ్వంసం కావడం. భీమా ఫేస్–2 రాకతో కొన్ని లిఫ్ట్‌లను పట్టించుకోకపోవడంతో మోటార్లు, పైపులు, ప్యానల్ బోర్డులు తుప్పుపట్టాయని రైతులు చెబుతున్నారు.

మూతబడిన లిఫ్టులు..

మండలం	లిఫ్ట్	ఆయకట్టు (ఎకరాల్లో..)
పెబ్బేరు	కంచిరావుపల్లి	600
పెబ్బేరు	మహబూబ్‌పాల్ సముద్రం	697
పెబ్బేరు	తోమాలపల్లి	350
కొత్తకోట	నాటెల్లి	600
కొత్తకోట	శంకరసముద్రం ఫేస్-1	2,358
కొత్తకోట	శంకరసముద్రం ఫేస్-2	2,131
ఆత్మకూర్	బాలకిష్టాపూర్	212
చిన్నంబావి	చిన్నమారూర్	6,000
చిన్నంబావి	చెల్లెపాడు	750
మదనాపురం	దుప్పల్లి ఊకచెట్టువాగు లిఫ్ట్	100
మదనాపురం	రామన్‌పాడు ఫేస్-1	133
మదనాపురం	రామన్‌పాడు ఫేస్-2	585
మదనాపురం	నెల్విడి	3,100
పాక్షికంగా నడుస్తున్న లిఫ్టులు..		
మదనాపురం	కురుమూర్తిరాయ	4,400
అమరచింత	అమరచింత	4,800
అమరచింత	చంద్రగఢ్	4,050
మదనాపురం	గుంటిపల్లి	350

ప్రజాధనం వృథా..

రూ.కోట్లు వెచ్చించి ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసినా ఆశించిన ఫలితాలు కనిపించకపోవడంతో ప్రజాధనం వృథా అయినట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. దశాబ్దాల పాటు సాగునీరు అందించి రైతుల శ్రేయస్సుకు దోహదపడుతాయని భావించిన ప్రభుత్వాలకు నిరాశే ఎదురైంది.

పాక్షికంగా నడుస్తున్న లిఫ్టులలో అనేక సమస్యలు తలెత్తుతుండటంతో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. ప్యానల్ బోర్డులు, మోటారు, పంపుల మరమ్మతులు, పైపులైన్ లీకేజీలు ఏర్పడుతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి నిరుపయోగంగా ఉన్న లిఫ్టులను వినియోగంలోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..



రైతులకు సాగునీరు అందించాలన్న ఆలోచనతో ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి లిఫ్ట్‌ల నిర్మాణం చేపట్టింది. పర్యవేక్షణ కొరవడటంతో చిన్నమారూర్, చెల్లెపాడు లిఫ్ట్‌లు మూతబడ్డాయి. పాలకులు స్పందించి వెంటనే వినియోగంలోకి తీసుకొచ్చి ఆయకట్టుకు సాగునీరు అందేలా చూడాలి.
– రామారావు, రైతు, చిన్నంబావి

మోటార్లు తుప్పు పడుతున్నాయి..



నెల్విడి లిఫ్ట్ మోటార్లు తుప్పుపడుతున్నాయి. ఇప్పటి వరకు ఈ లిఫ్ట్‌తో రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. ప్రభుత్వ సొమ్ము వృథా అయ్యే అవకాశం ఉంది. నెల్విడి, నర్సింగాపూర్, కొన్నూరు, ద్వారకనగరం రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సత్వరమే వినియోగంలోకి తేవాలి.
– జగదీశ్, నాయకులు, మదనాపురం

పాలకుల నిర్లక్ష్యంతో మూతబడింది..



గతంలో మహబూబ్‌పాల్ సముద్రం లిఫ్ట్ ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించింది. ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యంతో మూతబడింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఎకరాను సాగులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వెంటనే మరమ్మతు చేయించాలి.
– విజయవర్ధన్‌రెడ్డి, సభ్యుడు రైతు కమిటీ, పెబ్బేరు

వినియోగంలోకి తెస్తాం..

జిల్లాలోని అన్ని లిఫ్ట్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. మూతబడటానికి కారణాలు తెలుసుకుంటున్నాం. వినియోగంలోకి వచ్చే వాటికి కచ్చితంగా మరమ్మతులు చేయిస్తాం. ప్రభుత్వానికి పూర్తి వివరాల నివేదిక పంపుతున్నాం.
– జగన్మోహన్‌రెడ్డి, ఈఈ, నీటిపారుదలశాఖ

వైభవంగా వనపర్తి కలెక్టర్ వివాహం


వనపర్తి కలెక్టర్ వివాహానికి హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు

వనపర్తి: కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వివాహానికి జిల్లా మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డిలు హాజరయ్యారు. సోమవారం సాయంత్రం 7 గంటలకు మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాకేంద్రంలోని సోమేశ్వర్ ఆలయం వద్ద జరిగిన వివాహ వేడుకకు వారు హాజరై కలెక్టర్ తేజస్, దేవిక దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వాటర్‌ట్యాంక్ పెచ్చులుపడి బాలుడికి గాయాలు


శిథిలావస్థకు చేరిన నీటిట్యాంకు


గాయపడిన బాలుడు నందకిషోర్

చిన్నచింతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న మంచినీటి ట్యాంక్ పెచ్చులు ఊడిపడి అమ్మాపురం గ్రామానికి చెందిన బాలుడు నందకిషోర్ తలకు గాయాలయ్యాయి. నందకిషోర్‌కు జ్వరం రావడంతో ఆస్పత్రికి తీసుకొచ్చి ట్యాంకు సమీపంలో నిలబడగా పెచ్చులు ఊడిపడి గాయాలయ్యాయని తండ్రి కురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. బాలుడికి వైద్యుడు రాహుల్ చికిత్స అందించారు. శిథిలావస్థలో ఉన్న నీటిట్యాంకును తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అంకిరావుపల్లి సమీపంలో క్రాస్‌రోడ్డు దగ్గర కారు, బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ బాలవెంకటరమణ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన వసంత్‌రాజు అనే వ్యక్తి కారులో నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్‌కు వస్తున్నాడు. అంకిరావుపల్లికి చెందిన నారాయణదాస్(59) అదే గ్రామానికి చెందిన శంకరయ్యను ఎక్కించుకొని బైక్‌పై కొల్లాపూర్‌కు వస్తుండగా క్రాస్‌రోడ్డు దగ్గర బైక్‌ను అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణదాస్ అక్కడికక్కడే మృతిచెందగా.. శంకరయ్యకు తీవ్రగాయాలు కావడంతో కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వసంతరాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీసీఎం ఢీకొని వృద్ధుడు..

మాగనూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో డీసీఎం ఢీకొని ఓ మృతిచెందాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మాగనూర్‌కు చెందిన వాకిటి నర్సింహులు(72) కాలినడకన ఇంటికి వస్తుండగా మక్తల్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని.. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

మన్యంకొండ వద్ద యువకుడు..


నరేష్ (ఫైల్)

దేవరకద్ర రూరల్: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన నరేష్(25) మహబూబ్‌నగర్ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మన్యంకొండ సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. నరేష్‌కు భార్య, రెండేళ్ల కూతురు ఉంది.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


వేరుశనగ పంట కోతను పరిశీలిస్తున్న ఏడీఏ సక్రియానాయక్

ఎర్రవల్లిచౌరస్తా: రైతులు పంటల సస్యరక్షణలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అలంపూర్ వ్యవసాయ సహాయ సంచాలకులు సక్రియనాయక్ అన్నారు. సోమవారం ఇటిక్యాల మండలంలోని కొండేరు, జింకలపల్లి, మునుగాల గ్రామాలను సందర్శించి యాసంగిలో సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో యాసంగిలో రైతులు సాగుచేసిన వేరుశనగ పంట కోత ప్రయోగాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ హాజరై పొలాల్లో చేపట్టిన పంటకోత ప్రయోగాన్ని పరిశీలించి మాట్లాడారు. గణాంక శాఖ తరఫున ఈ పంటకోత ప్రయోగాన్ని చేపట్టామన్నారు. గ్రామంలో వేరుశనగ పంటకోత ప్రయోగంగా వెంకట్‌రాముడు పొలంలో 5మీ పొడవు 5మీ వెడల్పు విస్తీర్ణంలో పరిశీలించగా 10కేజీల 634 గ్రాముల దిగుబడి వచ్చింది. ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. సాధారణంగా పంటల దిగుబడిని అంచనా వేయడం కోసం ఈ ప్రయోగం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవళిక, వీఏఓ మహదేవుడు, రైతులు ఉన్నారు.

కిరాణ దుకాణం దగ్ధం



మక్తల్: మండలంలోని మంతన్‌గోడ్‌లో కిరాణ దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. అందులోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. దీంతో యజమాని మల్లేష్‌కు రూ.50 వేల నగదుతో కలిపి దాదాపు లక్ష రూపాయల ఆస్తినష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. మల్లేష్‌కు వినికిడి లోపం ఉందని, ముగ్గురు పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

ప్రేమ విఫలమై విద్యార్థి ఆత్మహత్య

జడ్చర్ల: ప్రేమ విఫలమై ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జడ్చర్ల పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం ప్రకారం.. బాలానగర్ మండలం నామ్యతండాకు చెందిన సభావత్ దేవిబాయి, రమేశ్‌ల కుమారుడు రాహుల్ (17) జడ్చర్లలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. తల్లిదండ్రులు కూలీ పనుల కోసం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు వలస వెళ్లగా.. రాహుల్ స్థానిక శ్రీనివాస్‌కాలనీలో స్నేహితుడు ప్రశాంత్‌తో కలిసి ఓ అద్దె గదిలో ఉంటూ విద్యనభ్యసిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి స్నేహితుడు నిద్రపోయిన తర్వాత రాహుల్ గదిలోని ఫ్యాన్ కొండికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం అతని స్నేహితుడు ప్రశాంత్ నిద్రలేచి ఉరివేసుకున్న రాహుల్‌ను చూసి.. ఈ విషయాన్ని వెంటనే కర్నూలులో ఉన్న తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో వెంటనే వారు బయల్దేరి వచ్చారు. కాగా.. తమ కుమారుడు ఓ అమ్మాయిని కొన్ని రోజులుగా ప్రేమిస్తున్నాడని, ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి సభావత్ దేవిబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ల దొంగలు అరెస్ట్

పెబ్బేరు: పట్టణంలో ప్రతి శనివారం జరిగే సంతలో సెల్‌ఫోన్లు దొంగిలించే వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌కు చెందిన కమ్మరి శేఖర్ తలుపు చెక్కల కొనుగోలుకు శనివారం సంతకు వచ్చారు. విక్రయదారుడితో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ కొట్టేశారు. ఆదివారం బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసునమోదు చేశారు. బైపాస్ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను చూసి ఓ కారులో ఉన్న నిందితులు తప్పించుకోవడానికి యత్నించారు. సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నారు. వారిలో కడపకు చెందిన రాజేష్, కల్యాణ్, ప్రవీణ్, ఇద్దరు మైనర్లు ఉన్నారు. వారిని విచారించగా బస్టాండ్లు, రద్దీ ప్రాంతల్లో సెల్‌ఫోన్లు దొంగిలిస్తామని ఒప్పుకున్నారు. వీరిపై గతంలో వివిధ ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేశామని.. కేసునమోదు చేసి వనపర్తి కోర్టులో హాజరుపచ్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

జడ్చర్లలో ఐటీ దాడులు

- శ్రీవెంకటరమణ జ్యువెలరీ దుకాణంలో సోదాలు
- హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లోనూ ఏకకాలంలో తనిఖీలు
- జీరోగా బంగారు, వెండి దిగుమతి చేసుకున్నట్లు గుర్తింపు
- కలవరపడిన స్థానిక బంగారం వ్యాపారులు


వెంకటరమణ జ్యువెలరీ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఐటీ అధికారులు

జడ్చర్ల: పట్టణంలో సోమవారం ఆదాయం పన్ను (ఐటీ) శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. స్థానిక నేతాజీ చౌరస్తాలో గల శ్రీవెంకటరమణ జ్యువెలరీ దుకాణంలో అధికారులు ముమ్మరంగా సోదాలు జరిపారు. జిల్లా ఆదాయ పన్ను శాఖ ముఖ్య అధికారులతోపాటు సిబ్బంది ఉదయం దుకాణం తెరిచిన వెంటనే ఒక్కసారిగా దుకాణంలోకి వచ్చి తనిఖీలు చేపట్టారు. దుకాణం షట్టర్‌ను మూసివేసి క్రయవిక్రయాలను నిలిపివేయించారు. దీంతో దుకాణంలో ఏం జరుగుతుందో తెలియక పలువురు వినియోగదారులు అయోమయానికి గురయ్యారు. వ్యాపారానికి సంబంధించిన రికార్డులను, బిల్లులను వారు పరిశీలించారు. కంప్యూటర్, ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకుని అందులో నమోదైన పలు వివరాలను సేకరించారు. ఆదాయం, వ్యయంకు సంబంధించిన వివరాలను, వాటికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అలాగే వీరికి చెందిన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ పాట్ మార్కెట్‌లోని దుకాణాలతోపాటు పరిగి, తాండూరు, షాద్‌నగర్‌లో గల బంగారు దుకాణాల్లో సైతం ఏకకాలంలో దాడులు చేసినట్లు సమాచారం. వ్యాపార లావాదేవీలకు సంబంధించి ఎంత మేర ఆదాయ పన్ను చెల్లించారు.. పన్ను పరిధిలోకి రాకుండా ఎంత వ్యాపారం నిర్వహించారో పరిశీలిస్తున్నారు.

రూ.కోట్లలో వ్యాపారం..

జడ్చర్లలో నిర్వహిస్తున్న జ్యువెలరీ షాప్‌లో ఏటా రూ.కోట్లలో వ్యాపారం కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. బంగారు, వెండి నగల వ్యాపారం మాత్రమే కాకుండా ప్రతినెలా గ్రూప్‌ల పేరుతో వందలాది మంది మహిళా సభ్యులతో ప్రతినెలా కొంత మొత్తం చెల్లించి గడువు తీరిన తర్వాత బంగారం, వెండి తీసుకునేలా తయారు చేసిన గ్రూపులను కూడా వీరు నిర్వహిస్తున్నారు. ఈ వ్యవహారం కూడా పెద్దఎత్తున సాగుతుండడంతో భారీగా టర్నోవర్ అవుతుంది. కాగా తనిఖీలలో పెద్దఎత్తున జీరోగా బంగారు, వెండి దిగుమతి చేసుకున్నట్లు ఐటీ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. వాటికి సంబంధించి బిల్లులు, లెక్కా పద్దులు ఎంతమేరకు ఉన్నాయో పరిశీలిస్తున్నారు.

గతంలోనూ పలుమార్లు..

జిల్లాలో ప్రధాన వ్యాపార వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన జడ్చర్లలో ఐటీ దాడులు నిర్వహించడం గతంలో కూడా జరిగింది. అయితే చాలామంది వ్యాపారులు, రియల్ ఎస్టేట్ తదితర రంగాలకు చెందినవారు ఆదాయ పన్ను ఎగవేసి అక్రమార్జనకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. వారిపై ఐటీ అధికారులు దృష్టిసారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యాపారుల్లో కలకలం..

జడ్చర్లలో ఐటీ దాడులు జరుగుతున్నాయన్న సమాచారం ఒక్కసారిగా దావణంలా వ్యాపించింది. దీంతో వ్యాపారుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమైంది. జ్యువెలరీతోపాటు రియల్ ఎస్టేట్ ఇతర వ్యాపారాలకు సంబంధించిన వివరాలపై కూడా ఐటీ అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. ఉదయం ప్రారంభమైన సోదాలు రాత్రి దాకా కొనసాగాయి. దాదాపు 8 మందితో కూడిన బృందం అనేక రికార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. విధుల్లో భాగంగానే రికార్డులను పరిశీలిస్తున్నామని ఐటీ అధికారులు స్థానిక విలేకరులకు తెలిపారు. ఫిర్యాదుల ఆధారంగా.. తమకు సమర్పించిన వివరాలలో అనుమానం కలిగినా తనిఖీలు నిర్వహిస్తామని పేరు వెల్లడించని ఓ అధికారి చెప్పారు. పన్నుల చెల్లింపు, వ్యాపార లావాదేవీలకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు.

చందాదారుల సొమ్ముతో దందా!

▶ మొదటి పేజీ తరువాయి


వివరాలు వెల్లడిస్తున్న సీఐడీ అదనపు డీజీ సంజయ్. చిత్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ

చెల్లిస్తున్న సొమ్ముకు ఎలాంటి భద్రతా లేదు' అని పేర్కొన్నారు. సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో వారు సంయుక్తంగా విలేకరులతో మాట్లాడుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను వివరించారు.

■ చిట్‌ఫండ్ చట్టం సామాజిక, ఆర్థికపరమైన చట్టమని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. చందాదారుల హక్కుల పరిరక్షణ, చిట్‌ఫండ్ కంపెనీల్లో ఆర్థిక క్రమశిక్షణ కోసమే ఈ చట్టం చేశారని పేర్కొంది. చిట్‌ఫండ్స్ చట్టం–1982 ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీ బ్రాంచిలోని మేనేజర్ (ఫోర్‌మేన్) చందాదారులు చెల్లించే సొమ్ముకు పరిరక్షకుడు. చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పర్యవేక్షకుడు. ■ బ్యాంక్ లావాదేవీల నిర్వహణ, నిధుల చెల్లింపులన్నీ ఫోర్‌మేన్ నిర్వహించాలి. రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉన్న 37 బ్రాంచీల్లో ఏడు బ్రాంచిలో తనిఖీలు చేశాం. చందాదారులు చెల్లించిన మొత్తం అక్కడి బ్యాంకుల్లో లేదన్న విషయం అందులో వెల్లడైంది. ఆ సొమ్మంతా నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించేశారు. ■ మార్గదర్శి ఫోర్‌మేన్‌కు చట్ట ప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తోసహా ఎలాంటి అధికారాలు లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజతోపాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. ■ ఇక్కడున్న చందాదారుల సొమ్ముల భద్రత గురించి అడిగితే తనకు తెలియదని ఫోర్‌మెన్ చెబుతున్నారు. హైదరాబాద్ వెళ్లి అడిగితే తెలంగాణలో ఉన్న ప్రధాన కార్యాలయం ఏపీ అధికారుల పరిధిలోది కాదంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చందాదారులు చెల్లిస్తున్న డబ్బులకు బాధ్యులెవరని ప్రశ్నిస్తే సమాధానమే లేదు. సొమ్ము రాష్ట్ర ప్రజలది...పెత్తనం పక్క రాష్ట్రంలో వారిది. ■ మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులకు చెందిన సొమ్ములను నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్, తమ అనుబంధ కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టారు. ఆ సంస్థ బ్యాలన్స్ షీట్, కొన్ని బ్యాంకు ఖాతాలను చార్టెడ్ అకౌంటెంట్ ద్వారా పరిశీలిస్తే ఈ విషయాలు బయటపడ్డాయి. అందుబాటులో ఉన్న కొన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్స్‌లో మూడుసార్లు రూ.29 కోట్లు, రూ.10 కోట్లు, రూ.8 కోట్లు చొప్పున, ఎడెల్‌వైజీస్ ఆర్బిట్రేడ్ ఫండ్స్‌లో రూ.10 కోట్లు చొప్పున నిబంధనలకు విరుద్ధంగా పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడైంది. పూర్తి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే ఇంకా ఎన్ని పెట్టుబడులు పెట్టారో తెలుస్తుంది. ■ విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరులో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఫోర్‌మెన్‌లను అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాం. గుంటూరు మినహా మిగతా మూడు చోట్లా న్యాయస్థానాలు నిందితులకు రిమాండ్ విధించాయి. నిందితులపై సీఐడీ మోపిన అభియోగాలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలున్నాయని రిమాండ్‌కు అనుమతిస్తూ న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. సీఐడీ కేసు డైరీలో పేర్కొన్న అంశాలతో తాము సంతృప్తి చెందినట్లు, వారిని అరెస్టు చేయడం సరైనదేనని పేర్కొన్నాయి.■ మార్గదర్శి యాజమాన్యం నిధుల ను అక్రమంగా బదిలీ చేస్తూ, చిట్స్ రిజిస్ట్రార్‌కు సహాయ నిరాకరణ కొనసాగిస్తే చందాదారుల ప్రయో జనాల పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారన్న అంశంతో మాకు నిమిత్తం లేదు. ఏపీ ప్రయోజనాలు, చందాదారుల సొమ్ముకు భద్రత కల్పించడమే మా విధి. ఈ కేసులో విచారణ కొనసాగిస్తాం. కేసు దర్యాప్తులో పురోగతికి అనుగు ణంగా ఏ–1 చెరుకూరి రామోజీ రావు, ఏ–2 చెరుకూరి శైలజనూ విచారించడం తోపాటు ఇతర చర్యలను తగిన సమయంలో తీసుకుంటాం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇదో.. పోంజీ తరహా స్కామ్

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌యాజమాన్యం పోంజీ స్కామ్ తరహా అక్రమాలకు పాల్పడుతోంది. చిట్టీలలో 30 శాతం నుంచి 40 శాతం టికెట్లు (సభ్యత్వాలు) యజమాన్యం పేరిట ఉంచుతోంది. ఆ టికెట్లకు చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. ఇతర చందాదారులు చెల్లించిన చందాలను తాము చెల్లించినట్లు రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. చందాదారుల సొమ్మును వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటోంది.

ఇక్కడెందుకీ పిటిషన్?

మార్గదర్శిని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు

- ఏపీలో హైకోర్టు ఉంది కదా..?
- కేసులు, దర్యాప్తు అంతా అక్కడే..
- అలాంటప్పుడు వీటిని విచారించే పరిధి ఈ కోర్టుకు ఉందా?
- దీనిపై తేలకుండా దర్యాప్తులో జోక్యం చేసుకోలేం
- విచారణ ఈ నెల 20వతేదీకి వాయిదా
- నిందితులు ఏ రాష్ట్రంలో ఉన్నా అరెస్టు అధికారం పోలీసులకు ఉంది
- వారిపై నమోదైనవి 10 ఏళ్ల పైగా శిక్ష పడే కేసులే
- ఏపీలో నమోదైన కేసుల్లో ఇక్కడ ఉపశమనం కోరలేరు
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్: 'ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఉంది కదా..? మరి ఇక్కడెందుకీ పిటిషన్ దాఖలు చేశారు..?' అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. కేసులు ఏపీలో నమోదయ్యాయి.. విచారణ అధికారులూ ఏపీ వారే.. బ్రాంచ్‌లు ఉన్నది కూడా అక్కడే.. అలాంటప్పుడు ఈ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు ఉందా? అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీనిపై తేలకుండా దర్యాప్తులో తాము జోక్యం చేసుకోవడం సరికాదని అభిప్రాయపడింది. ఏదేమైనా విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేస్తున్నామని, అలోగా పరిధిపై నిర్ణయిస్తామని స్పష్టం చేసింది. మార్గదర్శిపై ఏపీలో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా అరెస్టు సహా బలవంతపు చర్యలు చేపట్టకుండా, హైదరాబాద్‌లోని తమ ప్రధాన కార్యాలయంలో తనిఖీలు నిర్వహించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, చెరుకూరి రామోజీరావు, శైలజ తరఫున లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి, మార్గదర్శి తరఫున న్యాయవాది దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు.

అక్కడి కేసులపై.. ఇక్కడ విచారణా?

'409, 477(ఏ), 420 సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ 10 ఏళ్లకు పైగా శిక్ష పడే కేసులే. కాగ్నిజబుల్ నేరాల కిందికే వస్తాయి. ఏపీలో నమోదైన కేసులపై ఇక్కడ ఉపశమనం కోరలేరు. ఈ కోర్టుకు అక్కడి కేసులపై విచారణ జరిపే పరిధి లేదు. గతంలో పిటిషన్‌పై విచారణ సందర్భంగా తెలంగాణలోని మార్గదర్శి కార్యాలయాల్లో తనిఖీలపై కోర్టు స్టే ఇచ్చింది. అయితే అప్పటికే స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లను, రిజిస్టర్లను పరిశీలించగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో కేసులు నమోదు చేశారు. అక్రమాలు నిగ్గు తేలినప్పటికీ కేసులు నమోదు చేయవద్దని, ఎఫ్ఐఆర్ దాఖలు చేయవద్దని కోర్టు ఉత్తర్వుల్లో ఆదేశించలేదు. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. మొత్తం బ్రాంచ్‌లకు వారే బాధ్యులు. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలోకి అక్రమంగా మళ్లిస్తున్నారు. చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ చందాదారుల హక్కులకు విఘాతం కలిగిస్తున్నారు. ఒకటి రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని విషయాలపై తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. ఇది ఏపీ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. ప్రత్యేకంగా ఏపీకి హైకోర్టు ఏర్పాటైన తర్వాత తెలంగాణ హైకోర్టుకు అక్కడి అంశాలపై పరిధి ఉండదని చట్టం చెబుతోంది. ఒక్క డెట్ రిలీఫ్ ట్రిబ్యునల్(డీఆర్‌టీ)కి సంబంధించి డీఆర్‌టీ–2 రాయలసీమ పరిధి వరకు జోక్యం చేసుకోవచ్చని చట్టం చెబుతోంది. కేసులు నమోదు చేసిన నేరాలన్నీ ఏపీలోనే జరిగాయి. దర్యాప్తు చేస్తున్న పోలీసులూ అక్కడి వారే. అలాంటప్పుడు అరెస్టులు చేయవద్దని ఇక్కడ కోరడం చట్ట విరుద్ధం. అసలు అలా పిటిషనే వేయలేరు. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా పేర్కొంది. ఏపీ హైకోర్టు పరిధిలో కలుగజేసుకోలేమని ఇదే హైకోర్టు పలు తీర్పులను ఇచ్చింది. నిందితులు ఏ రాష్ట్రంలో ఉన్నా అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. అది వారికున్న చట్టబద్ధమైన అధికారం. ఏపీలో హత్య చేసి వచ్చి తెలంగాణలో దాక్కుని అరెస్టు చేయవద్దని ఇక్కడి కోర్టును కోరడం ఎలా చట్టవిరుద్ధమో.. ఇదీ అంతే' అని గోవిందరెడ్డి నివేదించారు. ''పోలీసులు హైదరాబాద్ వస్తున్నారా?'' అని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ప్రాథమికంగా నేరం జరిగింది.. అక్రమాలు జరిగాయని నిరూపణ అయితే అరెస్టు చేయవచ్చని గోవిందరెడ్డి నివేదించారు. ఇదో భారీ వైట్ కాలర్ నేరమన్నారు.

ముందుగా 'పరిధి' తేలుద్దాం..

'ఖాతాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. అయినా తనిఖీలు చేస్తున్నారు. ఎఫ్ఐఆర్‌లో ఏ–1గా రామోజీరావు, ఏ–2గా శైలజ పేర్లు చేర్చారు. మార్గదర్శి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తెలంగాణలో నివసించడం, తెలంగాణలోని బ్రాంచ్‌ల్లోనూ తనిఖీలు చేసే అవకాశం ఉన్నందున ఈ హైకోర్టులో పిటిషన్ వేశాం. ఏపీలో పలు బ్రాంచ్ మేనేజర్లను అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. తనిఖీలపై స్టే విధిస్తూ ఇదే కోర్టు గతంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పుడు తనిఖీలు చేపడితే అది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే అవుతుంది' అని మార్గదర్శి తరఫు న్యాయవాది దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ మిగతా అంశాల జోలికి ఇప్పుడు వెళ్లకుండా అసలు ఈ కోర్టుకు పరిధి ఉందా? లేదా? అన్న విషయాన్ని ముందుగా తేలుద్దామని స్పష్టం చేశారు.

+ తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది రూపేందర్ వాదనలు వినిపించారు. తెలంగాణ డీజీపీని ప్రతివాదిగా చేర్చారని, అసలు ఈ పిటిషన్ విచారణార్హం కాదన్నారు. వచ్చే సోమవారం వరకు పిటిషనర్లపై అరెస్టులు లాంటి చర్యలు తీసుకోబోమని గోవిందరెడ్డి తెలియచేయడంతో న్యాయమూర్తి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు.

అవినాశ్‌పై ఎలాంటి చర్యలొద్దు

అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టొద్దు

- సీబీఐకి తెలంగాణ హైకోర్టు ఆదేశం.. మధ్యంతర ఉత్తర్వులు జారీ
- సునీత పిటిషన్ వెనుక సీబీఐ హస్తం ఉంది
- ఏడాది తర్వాత ఆమె మాట మార్చారు..
- ఆ అభియోగాల వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయి
- వివేకా అల్లుడు, షమీమ్ పాత్రపై సీబీఐ విచారణ చేయడం లేదు
- అన్ని అంశాలపై దర్యాప్తు సాగేలా ఆదేశించండి
- హైకోర్టులో అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు విన్న అనంతరం అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సీబీఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. తాము తీర్పు వెలువరించే వరకు ఈ మధ్యంతర ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. వివేకా హత్య కేసులో సీబీఐ తనను విచారణకు హాజరు కావాలని ఆదేశించడంపై స్టే విధించాలని కోరుతూ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ విచారణ చేపట్టినా ఆడియో, వీడియో రికార్డింగ్‌తోపాటు దర్యాప్తు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగేలా సీబీఐని ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి(పిటిషనర్) తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. తదుపరి విచారణపై స్టే ఇవ్వాలన్న పిటిషన్‌పైనా తీర్పు రిజర్వు చేస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది.

రాజకీయ ఒత్తిళ్లతోనే అభియోగాలు..

'సునీత పిటిషన్ వెనుక సీబీఐ హస్తం ఉంది. కొందరు రాజకీయ నేతల ఒత్తిళ్లతోనే ఆమె పిటిషనర్ (అవినాశ్‌రెడ్డి)పై అభియోగాలు మోపారు. తన తండ్రి పిటిషనర్ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారని, ఇంటింటికి తిరిగారని హత్య జరిగిన అనంతరం కూడా చెప్పిన సునీత ఏడాది తర్వాత మాట మార్చారు. ఆ తర్వాత నుంచి పిటిషనర్‌పై ఆరోపణలు చేయడం ప్రారంభించారు. వివేకా హత్య కేసులో అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, హతుడి రెండో భార్య షమీమ్ పాత్రపై సీబీఐ విచారణ సాగించడం లేదు. వివేకా 2010లో రెండో పెళ్లి చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు జన్మించాడు. రెండో పెళ్లి కారణంగానే వివేకా కుటుంబంలో విభేదాలు వచ్చాయి. ఆర్థిక లావాదేవీల విషయంలో మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో తన పేరుతో ఉన్న ఆస్తులను రెండో భార్య పేరుతో రాయాలని వివేకా భావించారు. ఆస్తుల గొడవల వల్లే వివేకా హత్య జరిగింది. ఈ కేసులో రెండో పెళ్లి కూడా కీలక అంశం. సీబీఐ ఆ దిశగా విచారణ చేయాలి. వివేకాది గుండెపోటని పిటిషనర్ ఎక్కడా చెప్పలేదు. స్థానిక రాజకీయ నాయకురాలు శశికళతో పిటిషనర్ అసలు మాట్లాడనే లేదు. ఆమె కూడా ఇదే విషయాన్ని సీబీఐకి చెప్పింది. ఇదే కోర్టులో సీబీఐ దాఖలు చేసిన కౌంటర్ మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. అందులో శశికళ గురించి కూడా ప్రస్తావించారు. ఇప్పటివరకు సీబీఐ రెండు చార్జీషీట్లు దాఖలు చేసినా ఎక్కడా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు నివేదికను కనీసం పరిగణలోకైనా తీసుకోలేదు. నిష్పాక్షిక దర్యాప్తు చేసేలా సీబీఐని ఆదేశించాలి. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో 14న సీబీఐ విచారణకు పిటిషనర్ హాజరుకాకుండా ఆదేశాలు ఇవ్వాలి' అని న్యాయస్థానానికి నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

సీల్డ్ కవర్‌లో వివరాలు...

వివేకా హత్య కేసు డైరీని సీబీఐ సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించింది. 35 మంది సాక్షుల వాంగ్మూలం, 10 డాక్యుమెంట్లు, కొన్ని ఫొటోలు, హార్డ్‌డిస్క్‌లను న్యాయస్థానం ముందు ఉంచింది. వివేకా హత్య జరిగిన ప్రాంతంలో దొరికిన లేఖ, ఎఫ్ఎస్ఎల్ నివేదికను సైతం కోర్టుకు సమర్పించింది. కేసుకు సంబంధించి ఆధారాలను ధ్వంసం చేసినట్లు పిటిషనర్‌పై ఆరోపణలున్నాయని, ఆయనపై తీవ్ర చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయవద్దని న్యాయస్థానాన్ని సీబీఐ కోరింది. సీబీఐ కార్యాలయం ఎదుట మీడియాకు వివరాలను ఎంపీ వెల్లడించడం సరికాదని న్యాయస్థానం పేర్కొంది. ఈనెల 14న (మంగళవారం) విచారణ హాజరు నుంచి మినహాయింపు కోరే అంశంపై సీబీఐనే ఆశ్రయించాలని సూచించింది. ఈ కేసు విచారణ హైదరాబాద్‌కు బదిలీ అయిన తర్వాత పిటిషనర్ తండ్రి భాస్కర్‌రెడ్డిని కడపలో హాజరు కావాలని ఎందుకు పిలిచారని న్యాయమూర్తి సీబీఐని ప్రశ్నించారు. అయితే తాము పిలవలేదని సీబీఐ కోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా తన మీద, తన కుటుంబంపైనా ఆరోపణలు చేశారని అందుకే ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశానని ఈ సందర్భంగా వైఎస్ సునీత కోర్టుకు నివేదించారు.

'ఆర్‌ఆర్‌ఆర్' బృందానికి మంత్రి అభినందనలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): 'నాటు నాటు' పాట ద్వారా ఆస్కార్ అవార్డు సాధించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందానికి రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈ గీతాన్ని రచించిన తెలంగాణ ముద్దుబిడ్డ చంద్రబోస్, ఆలపించిన తెలంగాణ ముద్దుబిడ్డలు రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. బాహుబలి సినిమాతో తెలుగు సినీ ప్రస్థానాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన రాజమౌళి తెలుగు జాతి విప్లవ వీరులు కొమరం భీం, అల్లూరి సీతారామరాజులకు అంతర్జాతీయ స్థాయి గౌరవాన్ని తీసుకురావడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ గేయానికి అద్భుతమైన సంగీతాన్ని అందించిన ఎంఎం కీరవాణి, నాటు నాటు పాట ప్రపంచాన్ని ఆకర్షించడంలో కీలక భూమిక వహించిన కథానాయకులు రామ్‌చరణ్, జూ.ఎన్టీఆర్, కొరియోగ్రాఫర్ ప్రేమ్‌రక్షిత్‌లను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిలిమ్స్ కేటగిరీలో ఆస్కార్ గెలిచిన మరో చిత్రం ఎలిఫెంట్ విష్పరర్స్ చిత్ర యూనిట్‌కు సైతం మంత్రి అభినందనలు తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి చెప్పారు.

'ప్రమాదకర ఫార్మాకంపెనీ మాకొద్దు'


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్ల క్రాస్‌రోడ్ దేశాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మినీ ఇండస్ట్రీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీని రద్దు చేయాలని సోమవారం సర్పంచ్ రఘు ఆధ్వర్యంలో విద్యావంతులు, యువకులు, గ్రామస్తులు తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. పంటల సాగు, పశువులు, గొర్రెలు, మేకల పోషణే జీవనాధారమని, మనుషుల మనుగడకు ప్రమాదకరంగా మారుతున్న ఫార్మా కంపెనీ నెలకొల్పొద్దని తేల్చి చెప్పారు. నిత్యం కాలుష్య నీటిని బయటకు వదలడంతో ఆ ప్రాంతంలోని నీరు కూడా కలుషితమవుతుందని వివరించారు. త్వరలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. వెంటనే పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

నిలిచిన నీరు.. ఎండుతున్న పంటలు

- వరిపంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- సాగునీరు విడుదల చేయాలని వేడుకోలు


పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లి సమీపంలో ఎండిన వరిపంట


సాగునీటి సరఫరా లేక వట్టిపోయిన భీమా కాల్వ

పాన్‌గల్: వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని వివిధ గ్రామాల ద్వారా భీమా, కేఎల్ఐ, డీ–8 కాల్వల ద్వారా సాగునీరు ప్రవహిస్తుంది. దీంతో సాగునీటి కాల్వల ద్వారా నీరు అందుతుందనే ఉద్దేశంతో మండల వ్యాప్తంగా యాసంగిలో 13,800 ఎకరాల్లో వరిపంటను సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఆయా కాల్వల ద్వారా 20 రోజులుగా సాగునీటి సరఫరా నిలిచిపోవడంతో పంటలకు నీరు అందక పంటలు ఎండుముఖం పట్టాయి. సాగునీరు అందుతుందనే ఉద్దేశ్యంతో రూ.వేలు ఖర్చు చేసి పంటలను సాగు చేస్తే మధ్యలోనే నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగికి ముందు ప్రజాప్రతినిధులు పంట చివరి వరకు సాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చినా.. ప్రస్తుతం నీటి సరఫరా నిలిచిపోయిన ఏమి మాట్లాడటం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పంటలు ఎండిపోకుండా కాల్వల ద్వారా సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చెంచులకు మెరుగైన వైద్యం అందించాలి


చెంచుగూడెంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

బల్మూర్: అటవీ ప్రాంతాలకు సమీపంలోని చెంచుపెంటల్లో నివసించే ఆదివాసి చెంచులకు మెరుగైన వైద్యం అందించాలని, వారికి రోగాలు ప్రబలకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని లక్ష్మీపల్లి పంచాయతీలోని చెంచుగూడెంలో ఐటీడీఏ, జిల్లా ఆరోగ్యశాఖ సంయుక్తంగా ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా.. కలెక్టర్ శిబిరాన్ని సందర్శించి చెంచుల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చెంచులు నిత్యం పౌష్టికాహారం తీసుకునేలా ఇక్కడి వైద్య సిబ్బంది అవగాహన, సూచనలు చేయాలన్నారు. శిబిరంలో మలేరియా, క్షయ, హెచ్ఐవీ, బీపీ, షుగర్ పరీక్షలు చేయడం జరిగిందని డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్ కలెక్టర్‌కు వివరించారు. గర్భిణులకు ఏఎన్‌సి నమోదుతో గైనకాలజిస్ట్ ద్వారా, దృష్టి లోపంతో బాధపడుతున్న వారికి కంటి పరీక్షలు చేయించామన్నారు. కంటి చికిత్సలు అవసరమైన వారికి హైదరాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆస్పత్రిలో వైద్యం చేయించేందుకు రెఫర్ చేశామన్నారు. ఇదిలా ఉండగా, గ్రామంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెంచు మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన కలెక్టర్ ఎంపీడీఓతో మాట్లాడి వెంటనే అవసరమైన వారి ఇళ్ల వద్ద మరుగుదొడ్లు నిర్మించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ తారాసింగ్, ప్రశాంతి, డివిజనల్ ఉప మలేరియా అధికారి అశోక్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్ట్ కుమారాచారి, మల్లేష్ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట రూరల్: కంటి వెలుగు కార్యక్రమంపై అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. సోమవారం అచ్చంపేటలోని కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరాలకు మరింత మంది వచ్చేలా చూడాలని, నాణ్యతతో కూడిన కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి కళ్లద్దాలు అందించాలని ఆదేశించారు. ఆన్‌లైన్ డేటాను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. అంతకుముందు పట్టణంలోని 16వ వార్డులో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ శిబిరం ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్,కమిషనర్‌బలరాంనాయక్ పాల్గొన్నారు.

వేతనాలు అందక అవస్థలు

జోగుళాంబ శక్తిపీఠం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలో పని చేసే అర్చకులు, ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. దేవాదాయశాఖ పరిధిలో పనిచేసే అర్చక ఉద్యోగులకు ప్రతీ మూడు నెలలకు ఒకసారి వేతనాలు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి. అయితే కేవలం ఒక నెల వేతనాలు మాత్రమే జమచేస్తూ మళ్లీ రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో పెడుతున్నారు. గత రెండున్నర ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఆలయాల్లో అర్చక, ఉద్యోగ కుటుంబాల పరిస్థితులు దయనీయంగా ఉన్నాయి. ఆధార్ కార్డులు, బ్యాంకుఅకౌంట్‌కు అనుసంధానం చేయడం లేదని, అటెండెన్స్ రిజిస్టర్ నెలనెలా సక్రమంగా పంపడం లేదని, ఫైనాన్స్ డిపార్టుమెంట్‌లో ఆలస్యం అవుతందని రకరకాల కుంటిసాకులు చెబుతూ రెండున్నర ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగిస్తున్నారని అర్చక ఉద్యోగులు చెబుతున్నారు.

బాలబ్రహ్మేశ్వరాలయంలో రథోత్సవం

జోగుళాంబ శక్తిపీఠం: అలంపురంలోని శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామివారి దేవస్థానంలో వారోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రదోశ కాలంలో రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఉదయం, మధ్యాహ్నం ప్రదోశ కాలాల్లో ఉత్సవ విగ్రహాలను రథోత్సవంలో కూర్చుబెట్టి ఆలయప్రాకార ప్రదక్షిణలు నిర్వహిస్తూ ప్రత్యేక పూజలు, నివేదనలు చేశారు. రాత్రి స్వామివారికి దశవిధ హారతులు ఇచ్చారు.

ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరు

- కర్నూలు ఇరిగేషన్ ఎస్ఈతో సమావేశం
- సుంకేసుల బ్యారేజీ నీటి సామర్థ్యం పెంచాలని సూచన
- ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం

అలంపూర్: ఆర్డీఎస్ ఆయకట్టు రైతులకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరందించడానికి అన్నిచర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం పేర్కొన్నారు. ఏపీ రాష్ట్రంలోని కర్నూలులోని ఇరిగేషన్ కార్యాలయంలో ఎస్ఈ శేఖర్ రెడ్డితో సోమవారం సమావేశమైనట్లు తెలిపారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని అందించడానికి ఎస్ఈతో మాట్లాడినట్లు చెప్పారు. కర్నూలులోని కేసీ కాల్వకు నీటి విడుదలను తగ్గించి సుంకేసుల బ్యారేజీలో నీటి నిల్వ సామర్థ్యం పెంచితే అలంపూర్ నియోజకవర్గ రైతులకు మేలు జరుగుతుందని సూచించినట్లు తెలిపారు. సుంకేసుల బ్యారేజీలో నీటి నిల్వలు పెరిగితే తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా రైతులకు సాగునీటిని అందించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. దీంతో స్పందించిన ఎస్ఈ నీటివాటాను తగ్గించుకుని సుంకేసుల బ్యారేజీలో నీటి నిల్వల సామర్థ్యం పెంచడానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఆర్డీఎస్ ఈఈతో మాట్లాడి తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా సాగునీటిని అందించడానికి 400 క్యూసెక్కులు ఇండెంట్ పెట్టాలని సూచించినట్లు పేర్కొన్నారు. పీజేపీ ఎస్ఈతో సైతం మాట్లాడి పీజేపీ లింక్ కెనాల్ ద్వారా ఆర్డీఎస్ ఆయకట్టుకు 152 క్యూసెక్కులు విడుదల చేయించామని, నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో నీటి విడుదలలో జాప్యం జరిగిందని తెలిపారు. రైతులు సాగునీటి కోసం ఆందోళన చెందవద్దని కోరారు. వీరితో పాటు జెడ్పీటీసీ రాజు, ఆర్డీఎస్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, రవిరెడ్డి, శ్రీనుగౌడ్, రవిప్రకాష్‌రెడ్డి, ప్రకాష్, మోహన్ ఉన్నారు.


కర్నూల్‌లో ఇరిగేషన్ ఎస్ఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

జాతీయ అథ్లెటిక్స్‌లో జిల్లాకు బంగారు పతకాలు


విజయ సంకేతం చూపుతున్న జిల్లా క్రీడాకారులు

కందనూలు: కర్ణాటకలోని ఉడిపి జిల్లా అజ్జరాకాడు మహాత్మాగాంధీ అథ్లెటిక్స్ ప్రధాన స్టేడియంలో 10, 11, 12 తేదీల్లో 18వ యువజన జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. 18 ఏళ్ల బాలికల విభాగంలో వెయ్యి మీటర్ల స్ప్రింట్స్ మేడలేలో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు చుక్క శైలజ, మాల శ్రుతి బంగారు పతకాలు సాధించారని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజేందర్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సౌత్‌జోన్ పాలిటెక్నిక్ క్రీడల్లో మహబూబ్‌నగర్ విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన ఆలిండియా సౌత్‌జోన్ పాలిటెక్నిక్ క్రీడాపోటీల్లో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. మహ్మద్ అమాన్, రెహమాన్ డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్‌లో రెండోస్థానం, 4 × 400 రిలే పరుగులో శశాంక్, సాయికుమార్, సంతోష్, సురేష్ రెండోస్థానం, 1500 మీటర్ల పరుగులో చిన్నబాబు మూడో స్థానం, వాలీబాల్‌లో జ్యోతి, మహేశ్వరిలు రెండోస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్, కళాశాల హెచ్ఓడీలు, అధ్యాపకులు అభినందించారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్